# ‘అనంత కరువుకు అంతమెప్పుడు’ పుస్తకావిష్కరణ సభ



అనంతపురంలో పుస్తకావిష్కరణ సభ

**అనంతపురం, 21-6-17 :**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రచురించిన ‘అనంత కరువుకు అంతమెప్పుడు’ పుస్తకావిష్కరణ సభ స్థానిక ఎన్‌జివోహోమ్‌లో 21-6-17న జరిగింది. ఈ సభకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు కా॥ పి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, ప్రముఖ రచయిత శ్రీ సింగంనేని నారాయణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతపురం జిల్లా దశాబ్దాల కాలంగా కరవు కోరల్లో చిక్కి అల్లాడుతున్నదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో పూర్తిగా ఎడారిగా మారిపోతుందనే శాస్త్రవేత్తల హెచ్చరికలను ఆయన గుర్తుచేశారు. దున్నపోతుపై వాన చందంగా కరువు తీవ్రత గురించి పట్టని పాలకుల దుర్మార్గాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అనంత కరువుకు సంబంధించిన సంక్షిప్త చిత్రణ, వాస్తవ సేకరణ కమిటి వివరాలతోపాటు, కరువు నివారణకు చేపట్టాల్సిన అంశాలు ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న మాట్లాడుతూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో జిల్లాలోని కరువు ప్రాంతాలలో పర్యటించిన అనుభవాలను పేర్కొన్నారు. పనులులేక లక్షలాదిమంది గ్రామాలనే ఖాళీచేసి వలసలు వెళ్తున్న దుర్భర పరిస్థితులను వివరించారు. కరువు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక డిమాండ్స్‌పై సమైక్య ఆందోళనకు పూనుకోవటమే ఈ సమస్యకు పరిష్కారమార్గమన్నారు.

టి.ఎన్. మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డా॥బి.సూర్యసాగర్, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్.ఎం.బాషా ఈ పుస్తకంలో తాము రాసిన వ్యాసాలను గురించి వివరించారు. ప్రజాకళాకారులు కరువు పరిస్థితులపై పాటలు పాడారు.

oooo